

# ఈ సక్సెస్ 'యానిమల్'కి అంకితం

'యానిమల్' భామ త్రిప్తి దిమ్రీ మంచి ఖుషీ మీదున్నది. 'యానిమల్'తో రాత్రికి రాత్రికి నేషనల్ క్రష్‌గా అవతరించిన ఈ అందాలభామ ప్రస్తుతం 'బ్యాడ్‌న్యూస్' సక్సెస్‌ని ఓ రేంజ్‌లో ఎంజాయ్ చేస్తున్నది. ఇటీవల ఆ సినిమా ప్రమోషన్‌లో పాల్గొన్న త్రిప్తి 'యానిమల్'పై ఆసక్తికరంగా మాట్లాడింది. 'ప్రేక్షకులు మెచ్చిన సినిమా ఎప్పుడూ గొప్ప సినిమానే. 'యానిమల్'ని విమర్శించేవాళ్లు ఈ విషయం గుర్తుపెట్టుకోవాలి. 'యానిమల్' కోట్లాదిమందికి చర్చించుకునే అవకాశం ఇచ్చింది. నీడనిచ్చే చెట్టు కిందకే మనుషులు చేరతారు. కాయలున్న చెట్టుకే రాళ్ల దెబ్బలు తగులుతాయ్. 'యానిమల్' నా దృష్టిలో గొప్ప వృక్షం లాంటిది. నాలాంటి ఎందరికో ఆ సినిమా నీడనిచ్చింది. అంత మంచి సినిమాలో భాగమైనందుకు ఇప్పటికీ ఆనందిస్తూనే ఉన్నా. ఈ రోజు ఇంత బిజీగా ఉన్నానంటే కారణం 'యానిమల్' సినిమానే. అందుకే 'బ్యాడ్‌న్యూస్' సెక్సస్‌ని కూడా 'యానిమల్'కే అంకితం ఇస్తున్నా. 'యానిమల్ పార్క్' గురించి అందరిలాగే నాకూ తెలీదు. ఆ కథ ఏమిటో, ఎప్పుడు ప్రారంభిస్తారో కూడా క్లారిటీ లేదు. అది సందీప్‌గారే చెప్పాలి.' అని చెప్పుకొచ్చింది త్రిప్తి దిమ్రీ. 2026లో 'యానిమల్ పార్క్' ప్రారంభిస్తామని గతంలో సందీప్‌రెడ్డి వంగా తెలిపిన విషయం విదితమే.



# నేతాజీ సైనికుడిగా?

ప్రభాస్ కథానాయకుడిగా హను రాఘవపూడి ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు 'ఫౌజీ' అనే టైటిల్ దాదాపు ఫిక్స్ అంటున్నారు. స్వాతంత్ర్య సమరం నేపథ్యంలో సాగే ఈ సినిమా గురించి ఆసక్తికరమైన అప్‌డేట్ ఒకటి వినిపిస్తున్నది. ఇందులో ప్రభాస్ బ్రాహ్మణ యువకుడిగా కనిపిస్తారట. సుభాష్ చంద్రబోస్ నెలకొల్పిన 'ఆజాద్ హింద్ ఫౌజ్' సైన్యంలో ఓ సైనికుడిగా ఆయన పాత్ర ఉంటుందని టాక్. ఈ నేపథ్యంలో ఓ అందమైన ప్రేమకథను హను రాఘవపూడి రాసుకున్నారట. ఆగస్ట్ 22న ఈ సినిమా షూటింగ్ మొదలుకానుంది. మైత్రీమూవీమేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించనున్న విషయం తెలిసిందే.

# ప్రచారం కొత్తపుంతలు తొక్కింది



నాని కథానాయకుడిగా రూపొందుతోన్న 'సరిపోదా శనివారం' సినిమా ఆగస్ట్ 29న విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా చిత్ర బృందం ఈ సినిమా ప్రమోషన్‌ని వేగవంతం చేసింది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన వస్తున్న నేపథ్యంలో ఇందులోని ప్రధాన పాత్రలందరి ఫస్ట్‌లుక్స్‌ని శనివారం మేకర్స్ విడుదల చేశారు. ఇందులో భద్రగా అదితిబాలన్, గోవర్ధన్‌గా అజయ్, కూర్మానంద్‌గా మురళీశర్మ, నారాయణ ప్రభగా అజయ్‌ఘోష్ పాత్రలని పరిచయం చేస్తూ పోస్టర్లను విడుదల చేశారు. అలాగే ఈ మూవీలో సోకులపాలెం నేపథ్యం చాలా కీలకం కాగా, సోకులపాలెం ప్రపంచాన్ని పరిచయం చేస్తూ ఓ పోస్టర్‌ని కూడా రివీల్ చేశారు. ప్రియాంక అరుళ్ మోహన్ ఇందులో కథానాయిక. వివేక్ ఆత్రేయ దర్శకుడు. డి.వి.వి.దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మాతలు. ఈ చిత్రానికి కెమెరా: మురళి.జి, సంగీతం: జేక్స్ బిజోయ్.

# ప్రేమకు నేనిచ్చే నిర్వచనమే ఈ ఉషాపరిణయం



'నాకిష్టమైన టైటిల్ 'ఉషాపరిణయం'. ఈ టైటిల్‌తో సినిమా చేయాలనేది నా చిరకాల వాంఛ. అది ఇప్పటికి నెరవేరింది. ఇందులో కథానాయిక పేరు ఉషా. ఆమె పెళ్లి చుట్టూ తిరిగే కథ ఇది. 'లవ్ ఈజ్ బ్యూటిఫుల్' అనేది క్యాప్షన్‌గా పెట్టాను. ఎందుకు పెట్టానో సినిమా చూస్తే మీకే అర్థమవుతుంది. ప్రేమకు నేనిచ్చే నిర్వచనమే ఈ సినిమా.' అని దర్శకుడు కె.విజయభాస్కర్ అన్నారు. స్వీయదర్శకత్వంలో ఆయన నిర్మించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఉషాపరిణయం'. కె.విజయభాస్కర్ తనయుడు శ్రీకమల్ ఇందులో కథానాయకుడు. తాన్వీ ఆకాంక్ష కథానాయిక. ఆగస్ట్ 2న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా కె.విజయభాస్కర్ మీడియాతో ముచ్చటించారు. 'ఇది ఓ కుర్రాడి కథ. కొడుకు కోసం రాసుకున్న కథ మాత్రం కాదు. అయితే రషస్ చూశాక మావాడికి తగ్గ కథ అనిపించింది. తెలుగమ్మాయి తాన్వీ ఆకాంక్ష మంచి ఈజ్ ఉన్న నటి. ఇద్దరికీ మంచి పేరు తెచ్చే సినిమా అవుతుంది. నా గత చిత్రాల్లాగే ఇందులోనూ హ్యూమర్‌కు కొదవ ఉండదు. ఈ కథలోనే కామెడీ ఉంది. ఇంటెన్సిటీ ఉన్న ప్రేమకథ ఇది. మళ్లీ 'నువ్వునాకు నచ్చావ్' జానర్‌లో సినిమా చేసిన ఫీల్ కలిగింది.' అంటూ ఆనందం వ్యక్తం చేశారు విజయభాస్కర్. ఇంకా చెబుతూ 'జనరేషన్‌లు మారినా ప్రేక్షకుల అభిరుచిలో మార్పు రాదనేది నా నమ్మకం. అన్నీ సమపాళ్లలో జోడించి ఎంటర్‌టైన్ చేయగలిగితే తప్పకుండా ఆడియన్స్ ఆదరిస్తారు. అందరూ కలిసి భోంచేసినట్టు, కలిసి కూర్చొని చూసే సినిమా ఇది. అన్ని తరగతులవారూ ఎంజాయ్ చేసేలా సినిమా ఉంటుంది.' అని చెప్పారు విజయభాస్కర్.

# కొత్త సినిమాకు కొబ్బరికాయ కొట్టారు



అల్లరి నరేశ్ కథానాయకుడిగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించనున్న చిత్రం శనివారం పూజాకార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. మెహర్‌తేజ్ ఈ చిత్రానికి దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించే కాన్సెప్ట్‌తో దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారని, వారం రోజుల్లో రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుందని నిర్మాతలు చెప్పారు. రుహాని శర్మ ఇందులో కథానాయిక. మిగతా వివరాలు త్వరలో వెల్లడికానున్నాయి. ఈ చిత్రానికి కెమెరా: జిజు సన్ని, సంగీతం: జిబ్రాన్, సహనిర్మాత: వెంకట్ ఉప్పుటూరి.



# పురుషోత్తముడి పోరాటం

రాజ్‌తరుణ్ కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'పురుషోత్తముడు'. హాసిని సుధీర్ కథానాయిక. రామ్ భీమన దర్శకుడు. డా.రమేశ్ తేజావత్, ప్రకాశ్ తేజావత్ నిర్మాతలు. ఇటీవల విడుదలైన ఈ చిత్రం సక్సెస్‌మీట్‌ని శనివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. నిర్మాతల అభిరుచి వల్లే ఈ విజయం సాధ్యమైందని, ప్రేక్షకుల నుంచి కూడా అద్భుతమైన స్పందన వస్తున్నదని, పూల రైతుల సమస్యలకు తెరరూపం ఇవ్వడం మేం చేసిన వినూత్న ప్రయత్నమని దర్శకుడు చెప్పారు. తెలుగుదనం ఉట్టిపడే పాత్రను ఇచ్చి పోత్సహించిన దర్శక, నిర్మాతలకు కథానాయిక హాసిని కృతజ్ఞతలు చెప్పింది. సినిమా విజయం పట్ల నిర్మాతలు ఆనందం వెలిబుచ్చారు. ఇంకా సినిమాటోగ్రాఫర్ పి.జి.విందా కూడా మాట్లాడారు.

# క్వాలిటీ, కంటెంట్ ఈ సినిమాకు ప్రధానబలాలు



'సత్యరాజ్ ఈ సినిమాలో ఓ మంచి రోల్ చేశారు. ఆయన చేయడం వల్లే ఈ సినిమాకు పరిపూర్ణత వచ్చింది. దర్శకుడు విజయ్ మిల్టన్ స్క్రిప్ట్ ఈ సినిమాకు ప్రధానబలం. కేవలం కంటెంట్ మీదున్న నమ్మకంతో ఖర్చుకు వెనుకాడకుండా ఈ సినిమాను నిర్మించారు నిర్మాతలు కమల్ బోరా, డి.లలితా, బి.ప్రదీప్, పంకజ్ బోరా. క్వాలిటీ, కంటెంట్ ఈ సినిమాకు తప్పకుండా విజయాన్నిస్తాయి' అని విజయ్ ఆంటోని నమ్మకం వ్యక్తంచేశారు. ఆయన హీరోగా నటించిన పొయెటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'తుఫాన్'. ఆగస్ట్ 2న ప్రపంచ వ్యాప్తంగా సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో విజయ్ ఆంటోని మాట్లాడారు. అతిథిగా విచ్చేసిన దర్శకుడు కరుణాకరణ్ చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. తన పాత్రను దర్శకుడు విజయ్ మిల్టన్ చాలా జాగ్రత్తగా డిజైన్ చేశాడని, తన లుక్, మేకోవర్ అంతా కొత్తగా ఉంటుందని, అందరికీ నచ్చే థ్రిల్లర్‌గా ఈ సినిమా నిలుస్తుందని సత్యరాజ్ చెప్పారు. సాంకేతికంగా ఈ సినిమా నెక్ట్స్ లెవల్లో ఉంటుందని, తప్పకుండా విజయం సాధిస్తుందనే నమ్మకంతో ఉన్నామని దర్శక, నిర్మాతలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంకా సంగీత దర్శకుడు అచ్చు రాజమణి కూడా మాట్లాడారు.

# రొమాంటిక్ రామచంద్రుడు



యంగ్‌హీరో కృష్ణవంశీ, మోక్ష జంటగా నటిస్తున్న లవ్ ఎంటర్‌టైనర్ 'అలనాటి రామచంద్రుడు'. చిలుకూరి ఆకాశ్‌రెడ్డి దర్శకుడు. హైమావతి జడపోలు, శ్రీరామ్ జడపోలు నిర్మాతలు. ఆగస్ట్ 2న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా థియేట్రికల్ ట్రైలర్‌ని మేకర్స్ శనివారం విడుదల చేశారు. ఈ కథలోని డ్రామాని, భావోద్వేగాల తీవ్రతను ట్రైలర్‌లో చూపించే ప్రయత్నం చేశారు. అర్థవంతమైన సంభాషణలు, హత్తుకునే సన్నివేశాలతో కూడిన మంచి రొమాంటిక్ డ్రామా ఈ సినిమా అని, కృష్ణవంశీ, మోక్ష అద్భుతంగా నటించారని మేకర్స్ చెబుతున్నారు. బ్రహ్మాజీ, వెంకటేశ్ కాకుమాను, సుధ, ప్రమోదిని, చైతన్య గరికపాటి తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: ప్రేమ్‌సాగర్, సంగీతం: శశాంక్.టి, సహ నిర్మాత: కె.జగదీశ్వర్‌రెడ్డి











